క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల ధర్నా



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జేఏసీ నాయకుడు రవిచందర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ సిబ్బందికి రెండు పీఆర్సీలు, 9డీఏ ఏరియాస్, సీసీఎస్ బకాయిలు, ఎస్ఆర్బీఎస్, ఎస్బీటీ బకాయిలు చెల్లించాలన్నారు. అలాగే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన గవర్నర్ తమిళిసైకి ధన్యవాదాలు తెలిపారు. కార్మిక నాయకులు గోపి, లక్కోరా, నర్సయ్య, జయకుమార్, అనుమాదాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికితీయాలి



పెర్కిట్(ఆర్మూర్): ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికి తీయాలని ఉన్నతి ప్రోగ్రాం స్టేట్ రిసోర్స్‌పర్సన్ లక్ష్మీనాథం, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ నరేష్ అన్నారు. పెర్కిట్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఉన్నతి కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యంశాలు అర్థం చేసుకునే విధంగా బోధన ఉండాలన్నారు. ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకుని తరగతులు నిర్వహించాలన్నారు. నాగనాథ్, నరేందర్, రాజశేఖర్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి



వర్ని: సహకార సంఘంలో రైతులు తీసుకున్న దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను సకాలంలో చెల్లించాలని మోస్రా మండలం చింతకుంట సహకార సంఘం అధ్యక్షుడు గుడిపల్లి గంగారెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో శుక్రవారం సొసైటీ మహాజన సభ నిర్వహించారు. లక్ష రూపాయల రుణమాఫీ ప్రభుత్వం త్వరగా రైతుల ఖాతాలో జమ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. వైస్ చైర్మన్ చెన్నూరు నారాయణరెడ్డి, పాలకవర్గ సభ్యులు పోతారెడ్డి, గంగాధర్ ,సాయి రెడ్డి, సాయిలు, శశికళ పాల్గొన్నారు.

ఎన్డీఎస్ఎల్ లేఆఫ్‌ను ఎత్తివేయాలి



బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్(ఎన్డీఎస్ఎల్) లేఆఫ్‌ను వెంటనే ఎత్తివేసి పునరుద్ధరించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. పట్టణంలో ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 42వ రోజు కొనసాగాయి. శిబిరాన్ని పాపయ్య సందర్శించి, మద్దతు తెలిపారు. ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడపాలని పేర్కొన్నారు. నాయకులు వేల్పూర్ భూమయ్య, భూమన్న, ఎల్లయ్య, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



బోధన్: ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద్ర యాదవ్ సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో యువత దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. ఈమేరకు శుక్రవారం పలువురి దరఖాస్తులను ఆయన ఆర్టీవో కార్యాలయంలో అందించారు. నాయకులు బెంజర్ గంగారాం, కౌన్సిలర్ దూప్‌సింగ్, అశ్ఫక్, నక్క లింగారెడ్డి, శివకుమార్, రవిశంకర్‌గౌడ్, నరేష్ పాల్గొన్నారు.

వంతెనతో తీరనున్న కష్టాలు

- జలాల్‌పూర్‌లో వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు
- బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వ నిధులు
- పూర్తికావొస్తున్న పనులు



జలాల్‌పూర్‌లో నిర్మిస్తున్న వంతెన

బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో వంతెన నిర్మాణంతో ప్రజల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. కల్వర్టు స్థానంలో ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం లేకుండాఉంటుంది. ప్రస్తుతం వంతెన పనులు పూర్తికావొస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.29లక్షలతో నిర్మాణం..

జలాల్‌పూర్ గ్రామం ప్రవేశం వద్ద ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు వెళ్లుటకు రోడ్డుపై కల్వర్టు ఉండేది. కానీ గతేడాది కురిసిన భారీ వర్షాల వల్ల కల్వర్టు పైపులు కొట్టుకు పోయాయి. దీంతో మంత్రి ప్రశాంత్‌రెడ్డి స్పందించి తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. మరమ్మతులు చేపట్టినా.. మళ్లీ వర్షాలకు పైపులు కొట్టుకు పోయాయి. దీంతో శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.29లక్షల నిధులను మంజూరు చేసింది. పనులు గత మూడు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు 80శాతం పనులు పూర్తయ్యాయి. మరో 20 శాతం పనులు పూర్తయితే గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండ పోతాయి. భారీ వర్షాలు కురిసిన గ్రామానికి వెళ్లుటకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. వంతెన పనులు తుదిదశకు చేరుకోవడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు దెబ్బతినకుండ అధికారులు చర్యలు తీసుకోవాలని, పనులను మరింత వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇబ్బందులు లేనట్లే..

వంతెన నిర్మాణం పూర్తయితే దారి కష్టాలు తీరుతాయి. ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఉండవు. గతంలో రెండుసార్లు గండి పడటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. పనులను వెంటనే పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

– గడచంద కల్పన, సర్పంచ్, జలాల్‌పూర్

ఘనంగా ఇంజినీర్స్ డే



ఆర్మూర్‌లో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఇంజినీరింగ్ అసోసియేషన్ సభ్యులు



బోధన్ ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయంలో..

పెర్కిట్/ఆర్మూర్‌టౌన్/మాక్లూర్/బోధన్‌రూరల్: భారతదేశం గర్వించదగ్గ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శుక్రవారం ఇంజినీర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్‌లో ఇంజినీర్ అసోసియేషన్ సభ్యులు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. మాక్లూర్ మండలం దాస్‌నగర్ వద్ద గల వీఆర్ఈసీలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ డైరెక్టర్ దేవేంద్రప్రసాద్ పాల్గొని, మాట్లాడారు. ఇంజినీరింగ్ చదివే ప్రతి విద్యార్థి సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలన్నారు. అంతకుముందు విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. బోధన్‌లోని ట్రాన్స్‌కో డివిజన్ (బెల్లాల్) కార్యాలయంలో డీఈ ముక్తార్ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ ఇంజినీర్స్ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఏడీఈలు బెనర్జీ, రవీ కుమార్, లక్ష్మన్ నాయక్, ఏఈలు పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం



కిసాన్‌నగర్‌లో మాట్లాడుతున్న మాలసంఘ సభ్యులు

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌కు చెందిన ఎస్సీ మాల సంఘం సభ్యులు ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా శుక్రవాం ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం తీర్మాన ప్రతిని పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డికి అందించారు. మాజీ ఎంపీపీ నాగాభూషణం, శరత్, బీఆర్ఎస్ నాయకులున్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం





బాల్కొండలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు.. కమ్మర్‌పల్లిలో..

బాల్కొండ: మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గడిచిన తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకే ఓటు వేయాలని కోరారు. మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, నాయకులు లింగాగౌడ్, సాగర్‌యాదవ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంతోపాటు, కోనాపూర్, మానాలలో బీఆర్ఎస్ నాయకులు గడపగడపకు బీఆర్ఎస్ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. పీఏసీఎస్ డైరెక్టర్ బద్రి, ఉప సర్పంచ్ గంగారాం, మైలారం బాలు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్, కుకునూర్ గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, జరిగిన అభివృద్ధిని తెలిపారు. నాయకులు మిట్టపల్లి మహిపాల్, కోటపాటి నర్సింహానాయుడు, రేగుల్లరాములు, బోజపల్లి సురేష్, రాజశేఖర్‌గౌడ్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి







డొంకేశ్వర్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు.. మోస్రాలో రాస్తారోకో.. మోర్తాడ్‌లో సమ్మెకు మద్దతు తెలుపుతున్న సునీల్‌రెడ్డి

డొంకేశ్వర్‌ర్మూర్‌టౌన్/వర్ని/బోధన్‌రూరల్(బోధన్)/రుద్రూర్/బోధన్/బాల్కొండ/మోర్తాడ్/కమ్మర్‌పల్లి/వేల్పూర్: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వారు చేపట్టిన సమ్మె శుక్రవారం ఐదోరోజు కొనసాగింది. డొంకేశ్వర్‌లో అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి మద్దతు తెలిపారు. మోస్రాలో ప్రధాన రహదారిపై అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతు మహిళ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతిపత్రం అందించానని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ ఒక ప్రకటనలో తెలిపా రు. వేల్పూర్‌లో అంగన్‌వాడీ సిబ్బంది నల్లబాడ్జీలతో నిరసన తెలియజేశారు. కమ్మర్‌పల్లిలో అంగన్‌వాడీ టీచర్లు బోనాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపు నిర్వహించి నిరసన తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు నన్నే సాబ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.





కమ్మర్‌పల్లిలో బోనాల ఊరేగింపు.. బోధన్‌లో కళ్లకు గంతలు కట్టుకొని అంగన్‌వాడీల నిరసన

విజయభేరి సభను విజయవంతం చేయాలి

పెర్కిట్/మాక్లూర్/బాల్కొండ/మోర్తాడ్: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విజయ భేరి సభను విజయవంతం చేయాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఈమేరకు సర్పంచ్‌లు సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు గోర్త రాజేందర్, కాంగ్రెస్ పార్టీ ముప్కాల్ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, డీసీసీ డెలిగేట్ చందరవి, కిసాన్‌ఖేత్ మండల అధ్యక్షుడు సాగర్‌రెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఏర్గట్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి మాట్లాడారు. అలాగే మాక్లూర్‌లో మండల పార్టీ నాయకులతో గోర్త రాజేందర్ మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు అండగా ఉండటానికి సోనియమ్మ భారీ డిక్లరేషన్ ఇవ్వడానికి సభకు హాజరు కానున్నారని వెల్లడించారు. ప్రజలు, పార్టీ శ్రేణులు సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు.

సంక్షిప్తం

గురుకుల పాఠశాల పరిశీలన

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం పోచంపాడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేశ్ పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది మురళి తదితరులు ఉన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో శుక్రవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు పోస్టల్స్ స్కీమ్స్‌పై అవగాహన కల్పించారు. బీపీఎంలు దివ్య, వెంకటేష్ తపాల శాఖలో సేవింగ్ ఖాతాలు, ఆర్డీలు, సుకన్య సమృద్ధి యోజన పథకాలను ప్రజలకు వివరించారు. సర్పంచ్ లక్ష్మీ, హన్మాండ్లు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ జీపీ సర్పంచ్‌కు సన్మానం

నందిపేట్ (ఆర్మూర్): రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు విభాగంలో ఉత్తమ గ్రామపంచాయతీగా ఆంధ్ర నగర్ గ్రామ పంచాయతీ ఎంపికైంది. ఈసందర్భంగా శుక్రవారం నందిపేటలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీల సమక్షంలో ఆంధ్రనగర్ సర్పంచ్ రామారావుకు సన్మానం చేశారు.

సీఎం, స్పీకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



వర్ని: చందూర్‌లో సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిల చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. చందూర్‌కు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మంజూరు చేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తూ, క్షీరాభిషేకం నిర్వహించారు. నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, సర్పంచ్ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

వర్ని: మండలంలోని చింతల్‌పేట్ గ్రామానికి చెందిన కెతావత్ వసంత్ కొన్ని నెలల క్రితం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. దీంతో శుక్రవారం బాధిత కుటుంబానికి విద్యుత్ శాఖ ద్వారా మంజూరైన రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును ఏడీ రవికుమార్ అందజేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రుద్రూర్: రుద్రూర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత అవగాహన సమావేశం నిర్వహించారు. సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులు, బ్యాంకింగ్ ప్రాముఖ్యతను వివరించారు. బ్యాంకు మేనేజర్ వాసు, నారాయణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

రెంజల్(బోధన్): మండలకేంద్రంలోని అనాథ చిన్నారులకు బోధన్‌లోని తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు, బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ, కౌన్సిలర్ శరత్‌రెడ్డి శుక్రవారం పిల్లలకు కావాల్సిన నిత్యావసర సరుకులను అందించారు. ఉప సర్పంచ్ సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



రెంజల్(బోధన్): మండలంలోని నీలా హైస్కూల్‌ను శుక్రవారం స్థానిక నాయకులు పరిశీలించారు. పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విజిలెన్స్ కమిటీ సభ్యుడు శ్రీధర్, వైస్ ఎంపీపీ యోగేశ్ ఉన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ

నవీపేట: మండలంలోని ధర్మారం గ్రామంలో జీపీ భవన నిర్మాణానికి ఎంపీపీ సంగెం శ్రీనివాస్ శుక్రవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ మాధవి, నవీపేట సొసైటీ చైర్మన్ అబ్బన్న, ఎంపీటీసీ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

బోధన్‌టౌన్(బోధన్): కామారెడ్డి జిల్లాలోని దోమకొండలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు బోధన్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆర్చరీ శిక్షణ కేంద్రం నిర్వాహకులు పిర్యానాయక్ శుక్రవారం తెలిపారు. బోధన్‌లో నిర్వహిస్తున్న ఆర్చరీ శిక్షణా కేంద్రంలో శిక్షణ తీసుకుకుంటున్న అనంత లక్ష్మి, ముదస్సీర్, హితేష, బద్రినాథ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికయ్యారన్నారు.

క్రీడాసామగ్రి వితరణ



మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మానస స్వచ్ఛందసేవా సంస్థ సభ్యులు క్రీడాసామగ్రిని అందజేశారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు మానస గణేష్, జిల్లా కార్యదర్శి శ్యామ్, కోశాధికారి భూపతి రాజేశ్వర్, కృష్ణమూర్తి, సర్పంచ్ చింతమల్లారెడ్డి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు నందిపేట్‌లో ఈజీఎస్ ప్రజావేదిక

నందిపేట్: నందిపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం ఈజీఎస్ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో చేపట్టిన సామాజిక తనిఖీ వివరాలను ప్రజావేదిక ద్వారా ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు రెంజల్ మండల సమావేశం

రెంజల్(బోధన్): మండలకేంద్రంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లోలపు రజని అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, విండో చైర్మన్‌లు, అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు. ఈక్రమంలో సభ్యులు ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మాణం, అవిశ్వాస పరీక్షను నిలుపుదల చేయాలని ఎంపీపీ కోర్టు ద్వార స్టే తెచ్చుకున్నారు. ప్రతిగా బీఆర్ఎస్ సభ్యులు కూడా కోర్టును ఆశ్రయించారు. ఈ పరిస్థితుల్లో సమావేశాన్ని బహిష్కరించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

21న కోటగిరి మండల సమావేశం

రుద్రూర్: కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 21న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మనోహర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సునీతాశ్రీనివాస్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

ప్రసాదాల విక్రయానికి వేలం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఏకచక్ర శివాలయంలో శుక్రవారం లడ్డు, పులిహోర ప్రసాదాలను యేడాది పాటు విక్రయించడానికి దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. నిజామాబాద్‌కు చెందిన సురేష్ రూ. లక్షా 26వేలు వేలం పాడి దక్కించుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి





నూత్‌పల్లిలో కుండిలో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్యశాఖ సిబ్బంది.. నందిపేటలో

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ అధికారులు సూచించారు. మండలంలో శుక్రవారం వారు 'ఫ్రైడే- డ్రైడే' కార్యక్రమాన్ని చేపట్టారు. నూత్‌పల్లి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల ముందు కుండీల్లో, టైర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ సుచరిత, హెల్త్ సూపర్‌వైజర్‌లు సురేందర్, ప్రమీల ఉన్నారు.

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఫ్రైడే-డ్రైడే నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

మట్టి సేకరణ



మారంపల్లిలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ నేతలు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని మారంపల్లిలో శుక్రవారం మేరే మాటి–మేర దేశ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి మట్టి సేకరణ చేశారు. ఢిల్లీలో అమృత వాటిక నిర్మాణం కోసం ప్రతి ప్రాంతం నుంచి మట్టిని సేకరిస్తున్నామని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు విజయభారతి తెలిపారు. నాయకులు సురేందర్, గంగాధర్, నర్సయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

సినిమాలు — తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	చాంగురే బంగారు రాజా (తెలుగు) - 10.10, 7.10 రామన్న యూత్: 1.00 ఖుషి: 3.45, బిచ్చగాడు: 10.00
స్క్రీన్-2 –	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి -10.00, 1.10, 4.20, 7.30, 10.40
స్క్రీన్-3 –	మార్క్ ఆంటోని : 10.10, 1.20, 7.05, 10.15
స్క్రీన్-4 –	జవాన్(తెలుగు)- 11.00, 2.35, జవాన్(హిందీ)- 6.10, 9.45

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై అనిల్ రెడ్డి

మోర్తాడ్: వినాయక నవరాత్రుల పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. మోర్తాడ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ఎవరికి ఇబ్బంది కలుగకుండా పండుగను జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై అనిల్‌రెడ్డి, నాయకులు ఆనంద్, చిన్న రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం.మధుసూధన్ (ACO) : 9951027699
రాంనాథ్ (నిజామాబాద్ అర్బన్ & రూరల్) : 7997958181
ఎ.శివ (ఆర్మూర్) : 9848956776
పి.కళ్యాణ్ (బోధన్) : 83281 91021
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899